క్లుప్తంగా

నేటి నుంచి ఎల్ఎస్‌డీజీఎస్ శిక్షణ

కేవీపల్లె : మండలంలో రెండు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ఎస్‌డీజీఎస్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం, గురువారం జరిగే శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నేడు కలికిరిలో రెవెన్యూ సదస్సు

రాయచోటి టౌన్ : కలికిరిలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొనునున్నట్లు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలికిరి మండలంలోని ప్రజలు తమ రెవెన్యూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

విద్యుత్ ఆదాపై అవగాహన



విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

తంబళ్లపల్లె: విద్యుత్ ఆదాపై విద్యార్థులకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని ఎంఈఓ త్యాగరాజు కోరారు. మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా మోడల్ స్కూల్, హైస్కూల్‌లో విద్యుత్ శాఖ ఏఈ శేషుకుమార్ ఆధ్వర్యంలో లైన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ అవగాహన కల్పించారు. బొగ్గు, నీటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఖర్చు పెరిగిందన్నారు. పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సౌర, విండ్ పవర్‌లపై దృష్టి సారించిందన్నారు. ఎల్ఈడీ బల్బుల వినియోగం ద్వారా విద్యుత్ ఆదా అవుతుందన్నారు.

కారు బోల్తా - వైద్యాధికారికి గాయాలు

కలికిరి: కారు బోల్తా పడి వైద్యాధికారి గాయాలపాలైన ఘటన మంగళవారం మండలంలోని మేడికుర్తి పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా... మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప వాల్మీకిపురం పట్టణంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం విధులకు కారులో వస్తుండగా వాల్మీకిపురం-మేడికుర్తి రోడ్డు పారపట్ల సమీపంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై ఉన్న ఇసుక కుప్ప ఉండటంతో కారు బోల్తా పడింది. ప్రమాదంలో వైద్యాధికారి చిన్నరెడ్డెప్పకు గాయాలయ్యాయి. పలువురు వైద్యాధికారిని పరామర్శించారు.

20 నుంచి బాస్ వార్షికోత్సవాలు

బి.కొత్తకోట: భారతీయ అంబేడ్కర్ సేన 13వ ఆవిర్భావ ఉత్సవాలను ఈనెల 20 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్టు బాస్ జిల్లా నాయకులు సింగన్న మంగళవారం తెలిపారు. పల్లెలు, పట్టణాల్లో బాస్ కార్యకర్తలు, నాయకులు ప్రజలతో కలిసి ఆయా ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించి కుల నిర్మూలన చైతన్య కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 29న మదనపల్లెలో కుల నిర్మూలన చైతన్య సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

కలికిరి(వాల్మీకిపురం): మదనపల్లి పట్టణం రామతులసీ కళ్యాణ మండపంలో గుర్రంకొండ సర్పంచ్ జమీర్ అలీఖాన్ బంధువులు వివాహ కార్యక్రమానికి హాజరైన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, వాల్మీకిపురం మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, మైనార్టీ నాయకులు ఖదీర్, నూర్ అహ్మద్, బాబు తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

జీహెచ్‌ఆర్‌పీఏ యూత్ వింగ్ చైర్మన్‌గా విక్టరీ



వెంకటరమణారెడ్డిని సత్కరిస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం (జీహెచ్‌ఆర్‌పీఏ) పీలేరు నియోజకవర్గ యూత్ వింగ్ చైర్మన్‌గా పీలేరుకు చెందిన విక్టరీ వెంకటరమణారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ భువనగిరి వెంకటగణేష్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విక్టరీ వెంకటరమణారెడ్డిని సర్పంచ్ హబీబ్‌బాషా తోపాటు వార్డు మెంబర్లు సాంబశివారెడ్డి, కాలేషాలు దుశ్శాలువతో సత్కరించారు.

రెవెన్యూ నోటీసులపై చలనంలేని శాఖలు

- హార్సిలీహిల్స్‌పై భూములపై శాఖలకు నోటీసులు
- వీఆర్‌ఏ ద్వారా పనివాళ్లకు, ఉద్యోగులకు..
- తదుపరి చర్యలపై ముందుకు వెళ్లని రెవెన్యూ యంత్రాంగం



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు జారీ చేసిన నోటీసు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై భూములు పొందిన ప్రభుత్వశాఖలకు ఈనెల 4న నోటీసులు జారీ చేసి మీ భూముల కేటాయింపు రికార్డులను వారంలోగా సమర్పించాలని తహసీల్దార్ నోటీసులు జారీ చేసిన విషయం సాక్షి పాఠకులకు తెలిసిందే. అయితే ఈ నోటీసులపై రెండు వారాలైనా ఒక్కశాఖకు చెందిన అధికారులు కూడా స్పందించలేదు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు నోటీసులు ఇచ్చిన అధికారులు ఇప్పుడేం చేయాలన్న దానిపై వేచి చూస్తుండగా, మరో వైపు ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. హార్సిలీహిల్స్‌పై 35 ఏళ్ల క్రితం నుంచే వివిధశాఖలు, సంస్థలకు రెవెన్యూశాఖ భూములను కేటాయిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా కొన్నిశాఖలు భవనాలు, అతిథిగృహాలు, ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ సాగుతోంది. అయితే కొండపై ప్రక్షాళన చేయాలని రెవెన్యూశాఖ నిర్ణయించింది. ఈ మేరకు 9 శాఖలకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులు జారీ చేయడం వరకే సరిగ్గానే ఉన్నా వాటిని అందించిన విధానమే ఉన్నతాధికారుల స్పందన లేకపోవడానికి కారణంగా భావిస్తున్నారు.

పనివాళ్లకు ఇచ్చారు

హార్సిలీహిల్స్‌పై చిత్తూరుజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి సంబంధించిన నోటీసును ఇక్కడ పనిచేస్తున్న ఓ ప్రైవేటు వ్యక్తికి అందించారు. పోలీసు అవుట్ పోస్టు, పోలీసు అతిథిగృహంకు సంబంధించి ఇక్కడ పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌కు, తపాలా శాఖకు సంబంధించి స్థానిక చిరుద్యోగికి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించి బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి లీజుదారునికి, ఆయుర్వేద కేంద్రానికి, క్రీడాశాఖకు ఎకరాలకు సంబంధించి ఓ కాంట్రాక్టర్‌కు, ఈద్గాకు సంబంధించి ఓ ప్రైవేటు వ్యక్తికి నోటీసులు ఇచ్చారు. అది కూడా ఓ వీఆర్‌ఏ ద్వారా నోటీసులు పంపగా అతను హార్సిలీహిల్స్‌పైకి వెళ్లి అక్కడ పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులకు, చిరుద్యోగులకు అందించారు. నోటీసులను సంబంధిత ఉన్నతాధికారులు లేదా జిల్లా అధికారులకు నేరుగా లేదా పోస్టు ద్వారా పంపివుంటే స్పందన మరోలా ఉండేది. అయితే నోటీసుల జారీ, అందించిన విధాన లోపమే శాఖల నుంచి స్పందన లేకపోవడానికి కారణంగా కనిపిస్తోంది.

ఆలోచనలో రెవెన్యూ

హార్సిలీహిల్స్‌పై రెవెన్యూ భూముల వ్యవహారంలో పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, తద్వారా భూములను గుర్తించి తదుపరి చర్యలు తీసుకోవాలన్న ఆలోచనతో ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. నోటీసులు ఇచ్చి రెండు వారాలైనా ఇప్పటివరకు ఒక్కశాఖ నుంచి కూడా స్పందన లేదు. వారి ఆధీనంలోని భూమి ఎలా వారికి కేటాయించబడిందో దానికి సంబంధించిన రికార్డులను ఇంకా ఒక్క కూడా సమర్పించలేదు. తమ నోటీసులకు స్పందన లేని తహశీల్దార్ మొహమ్మద్ అన్సారీ మంగళవారం చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చామని వారి ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోరా ?



బీకేపల్లె రెవెన్యూ సదస్సులో స్థానికులు ఫిర్యాదు చేసిన అక్రమ నిర్మాణం

మదనపల్లె : భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంటే...క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. భూ సమస్యలపై అధికారులకు నేరుగా బాధితులు వెళ్లి ఫిర్యాదులు చేస్తే... చూద్దామంటూ అధికారులు నిర్లక్ష్యం కనపరుస్తుంటే...ప్రజలు ఇంతలో మాత్రానికి సదస్సులు ఎందుకంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మదనపల్లె పట్టణం బీకే.పల్లె పంచాయతీ వైఎస్సార్ నగర్ సచివాలయ పరిధిలో రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, రెవెన్యూ అధికారులు హాజరయ్యారు. సదస్సులో సచివాలయానికి కూతవేటు దూరంలో ఓ వ్యక్తి ఎలాంటి పట్టా లేకున్నప్పటికీ, గుట్టను చదునుచేస్తూ అక్రమ నిర్మాణం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కాలనీలో అతడికి చాలా ఇళ్లు ఉన్నాయని, ఇతరుల నుంచి పట్టా కొనుగోలు చేశానని, నకిలీ పట్టాతో ఆక్రమణ చేస్తున్నాడని ఫిర్యాదుచేశారు. కావాలంటే మీరు వస్తే ఇప్పుడే చూపిస్తామని చెపితే... రెవెన్యూ వీఆర్వో మస్తాన్... భోజనాలు రావాల్సి ఉంది. వచ్చాక వస్తా మీరు పదండని చెప్పారు. తహసీల్దార్ ఖాజాబీకి చెపితే...వీఆర్వో చూస్తాడులేండి అంటూ సమాధానమిచ్చారు. చివరకు ఎవరూ వెళ్లలేదు. తర్వాత సాయంత్రం వీఆర్వో మస్తాన్‌ని ఆక్రమణ విషయమై అడిగితే...బాత్‌రూమ్ కడుతున్నారని, పనులు నిలిపేయాల్సిందిగా చెప్పానన్నారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా అనర్హులు ఇళ్లు కడుతున్నారని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులే, అక్రమార్కులకు సహకరించడంపై స్థానికులు నిట్టూర్పులు విడిచారు.

శిక్షణ కార్యక్రమం బహిష్కరణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినారాయణ

ములకలచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకాకుండా బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండల సర్వసభ్య సమావేశం జరగకుండా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. దీనితో మండల అభివృద్ధిపై చర్చించే అవకాశం లేకపోయిందన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు తమకు ఎటువంటి సమాచారం అందించడంలేదని చెప్పారు. అధికారులు కూడా అధికార ప్రభుత్వం నాయకుల వైపే వంతు పలుకుతుండడంతో నిరసిస్తూ శిక్షణ కార్యక్రమానికి హాజరుకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యులు మోహన్‌రెడ్డి, ఎంపీపీ సాయిలీలా, సర్పంచులు తహమత్‌బీ, మంజులా, రాంబాబు, మహబూబ్‌బాషా, య. విజయమ్మ, సునీత, ఎంపీటీసీలు ఆయిషా, రేష్మా, క్రిష్టప్ప, లక్ష్మీదేవి, నరసింహులు శిక్షణను బహిష్కరించారు. సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులతో మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పూర్తి చేశారు.

రైతులకు ఉచితంగా సోలార్ పరికరాలు పంపిణీ



రైతులకు సోలార్ పరికరాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న ఐసీఐసీఐ ఫౌండేషన్ సభ్యులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె, నడిమికండ్రిగ గ్రామాల్లో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సోలార్ లైట్స్‌ట్రాప్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రైతులకు సోలార్ లైట్‌ట్రాప్స్, బిట్టరీస్ప్రేర్స్, బయోపుట్స్, ఉపాధి పరికరాలను ఉచితంగా రైతులకు అందించారు. వాటిని ఎలా వినియోగించాలో ప్రదర్శన ద్వారా వివరించారు. ఈసందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ అభివృద్ధి అధికారి రాజేశ్వరీ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా రైతులకు పంటనష్టం తగ్గించే పరికరాలను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. భూమిలేని నిరుపేదలకు నాటుకోళ్లు ఉచితంగా ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధి చెందేలా చూస్తామన్నారు. రైతుల పొలాల్లో ఇంకుడుగుంతలు, ఫాంపాండ్స్, బోర్‌వెల్ రీచార్జ్, ప్రజలందరి కోసం కమ్యూనిటీ లెవెల్ రీచార్జ్ వంటి పనుల పట్టడం వలన భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ధరనేశ్వరీ, సునీత, వెంకట కుమార్, మధుసూధన్, రైతులు పాల్గొన్నారు.

కిషోరి వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం: స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో కిషోరి వికాసంపై మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు శిక్షణ ఇచ్చారు. పిల్లల తల్లిదండ్రులు ప్రధానంగా బాలికల చదువు, నడవడికపై ప్రత్యేక దృష్టి సారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండాకే వివాహం చేయాలని, యుక్త వయస్సు రాగానే బాలికలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించేలా చూడాలన్నారు. బాలికలకు చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు నేర్పి సక్రమ మార్గంలో నడిచేలా కన్నవాళ్లు ప్రత్యేక చొరవ చూపేలా శ్రద్ధ వహించాలన్నారు. సీడీపీఓ భాగ్యమ్మ, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఏపీఎం హరి, వైద్యాధికారి డాక్టర్ పురుషోత్తం నాయక్, సూపర్‌వైజర్లు భవాని, జయరాణి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

– ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి

నిమ్మనపల్లె : గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్ జి ఎస్ ఏ) 2024–25 కార్యాచరణ ప్రణాళిక- స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులు శిక్షణ, గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను స్థానికంగా అభివృద్ధి చేయటానికి అవసరమైన పనులను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందని, సర్పంచులు ఆ దిశగా పనులను గుర్తించాలన్నారు. గ్రామాలలో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామస్థాయిలోనే యువతకు ఉపాధి మార్గాలను అన్వేషించాలన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఉమ్మడిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

కలికిరి: మండల వనరుల కేంద్రంలో మంగళవారం ఎంపీడీఓ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎల్ఎస్‌డీజీ)పై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో పేదరికం లేని మెరుగైన జీవనోపాదుల పంచాయతీ, సుపరిపాలన పంచాయతీ, మహిళ హిత పంచాయతీ, నీటి సంవృద్ధి గ్రామాలు, సామాజిక న్యాయం, సామాజిక భద్రత తదితరాలపై మండల రిసోర్స్ పర్సన్ శంకర వివరించారు.

ఆర్థిక సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల ఆర్థిక సుస్థిరాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ఆర్థిక ఆదాయ వనరులు, సంపద తయారీ విధానం, గ్రామ పంచాయతీల లక్ష్యాలు, అభివృద్ధికి చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌తో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

– డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఆర్టీసీ వన్ డీఎం వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయంలో డ్రైవర్లకు శిక్షణా శిబిరం జరిగింది. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా చేర్చాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి





పీలేరు: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, పెద్దమండ్యంలో...

పీలేరు రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమా అన్నారు. మంగళవారం మండలంలోని కాకులారంపల్లె పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో 35 అర్జీలు స్వీకరించామని, అందులో 30 భూసమస్యలపై, 5 ఇంటి పట్టాల కొరకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి గడువులోపు పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్ రావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డీ పట్టాల కోసం రైతుల వినతి

పెద్దమండ్యం: వారసత్వంగా సాగుచేసుకుంటున్న తమ భూములకు డీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని గిరిజన రైతులు తహసీల్దార్ సయ్యద్ అహ్మద్‌కు వినతి అందజేశారు. మండలంలోని అవికేనాయక్‌తండాలో మంగళవారం గ్రామ సర్పంచ్ నటరాజునాయక్ అధ్యక్షతన రెవెన్యు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి, హౌసింగ్ ఈఈ వెంకటదాసు, తహసీల్దార్‌లు రైతులు, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పలువురు రైతులు భూ సర్వే, భూముల ఆన్‌లైన్ కోసం అర్జీలు అందించారు. అలాగే మరికొందరు పింఛన్లు, ఇతర సమస్యలపై అధికారులకు ప్రజలు అర్జీలు ఇచ్చారు. సా కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీర్‌వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూర్లపల్లి సదస్సులో 58 అర్జీలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మొత్తం 58 అర్జీలు వచ్చినట్లు నోడల్ అధికారి పురుషోత్తం, తహసీల్దార్ శ్రీరాములు నాయక్ తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి 19 అర్జీలు రాగా పింఛన్లు, పౌర సరఫరా, హౌసింగ్‌కు సంబంధించి మిగిలిన అర్జీలు అందాయి. వారికి అధికారులు రశీదులు అందించారు. సర్పంచ్ సుబ్బిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు వెంకట్రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చినపరెడ్డితో పాటు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో ఎనిమిది అర్జీలు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని బాలరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. రెవెన్యూకు సంబంధించి ప్రజల నుంచి ఎనిమిది అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్జీదారులకు రశీదులు ఇచ్చినట్లు తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు బీఓ రామ్‌రాజు, ఆర్ఐ ముద్దు కృష్ణమ యాదవ్, దేవాదాయ శాఖ రికార్డు అసిస్టెంటు కొండ కిట్ట తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే



పెన్షనర్స్ డే నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్టీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పెన్షనర్స్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ పెన్షన్ డే ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు ముని గోపాల కృష్ణ మాట్లాడుతూ..పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ భిక్ష కాదు హక్కు అని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వైఎస్.మునిరత్నం, సభ్యులు ధనలక్ష్మీ, తిరుపతిరావు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

– ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సంఘ అధ్యక్షులు బి.టి.నరసింహులు అధ్యక్షతన పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ ఎన్‌జీఓ ఉపాధ్యక్షులు రెడ్డిశేఖర్, కార్యదర్శి ఏ.శ్రీనివాసులు(ఏటీఓ), ఎస్టీఓ బి.నరేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విశ్రాంత ఉద్యోగుల తరపున 20మందికి, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ తరపున 21 మంది విశ్రాంత ఉద్యోగులను ఘనంగా దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఎంప్లాయి నారాయణరావు కుటుంబసభ్యులు ఆయన జ్ఞాపకార్థంగా విశ్రాంత ఉద్యోగులకు భోజనసదుపాయం, శాలువలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బి.వి. రమణ, కోశాధికారి నరసింహులు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు

– అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి

కురబలకోట: తప్పుడు కేసులకు భయపడేది లేదని, న్యాయ పోరాటం చేస్తానని మండల వైఎస్సార్ సీపీ నాయకుడు, అంగళ్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముదివేడు పోలీసులు తనపై అకారణంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. అంగళ్లు పోలీస్ స్టేషన్ స్థలం విషయంలో తనకు ఎలాంటి ప్రమేయం లేకున్నా కబ్జా పేరుతో తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. తాను సంఘటన స్థలంలో లేకున్నా పరువు ప్రతిష్టలకు భంగం కల్గించాలని కుట్రతో కేసులో ఇరికించారన్నారు. కానిస్టేబుల్ హరిపై దాడికి యత్నించానని, అతనిపై హత్యాయత్నంకు పాల్పడినట్లు సృష్టించారన్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తాను ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఎక్కడైనా భూముల కబ్జాలకు పాల్పడినట్లుగా నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనన్నారు. ఇటీవల కుమ్మరి ఫ్యాక్టరీ వద్ద పోలీస్ స్టేషన్ స్థలాన్ని కబ్జాకు ప్రయత్నించినట్లుగా నిరూపిస్తే రాజకీయాల నుంచి కూడా శాశ్వితంగా దూరమవుతానన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజాదరణను దూరం చేయలేరన్నారు. చేయని తప్పుకు పోలీసులు పెట్టిన కేసుకు భయపడేది లేదని మరోసారి స్పష్టం చేశారు. చట్టం పట్ల తనకు అపారమైన గౌరవ భావం ఉందన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : గ్రామాల్లో రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని బీకే.పల్లె వైఎస్సార్ కాలనీ సచివాలయ పరిధిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు భూసమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా, హౌసింగ్‌లో బిల్లు పడినప్పటికీ తమ ప్లాట్లలో ఇతరులు అక్రమనిర్మాణాలు జరిపారని అలాగే తమ స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకున్నారంటూ ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...బీకే.పల్లె వైఎస్సార్ కాలనీలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులు బాధ్యతతో పనిచేస్తే సమస్యలు ఉండవన్నారు. ఈ సందర్భంగా దోబీ ఘాట్‌కు ఎకరా స్థలాన్ని కేటాయించాల్సిందిగా రజకసంఘం నాయకులు నాగయ్య, కృష్ణమూర్తిలు ఎమ్మెల్యేకు వినతిచేశారు. దీనిపై స్పందించాల్సిందిగా ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, ఆర్ఐ శేషాద్రి, వీఆర్వో మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక పాలదిగుబడి



పాడి రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ బాలసుబ్రమణ్యం

తంబళ్లపల్లె: పాడి ఆవుల పోషణలో రైతులు మెలకువలు పాటించినప్పుడే అవి ఆరోగ్యంగా ఉండి అధిక పాల దిగుబడి పొందవచ్చని పశు గణాభివృద్ధి శాఖ ఈఓ డీఎల్‌డీఏ డాక్టర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం కన్నెమడుగు పశు వైద్యశాల పరిధిలోని మద్దిమాకులపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రైతులకు పశువుల పోషణ, సీజనల్ వ్యాధులు ముందస్తు జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 55 పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. దూడలకు నట్టల నివారణ మందు ఉచితంగా అందజేశారు. గోమార్లు పిడుదల నివారణకు బ్రూటాక్స్ స్ప్రే చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె పశువైద్యశాల ఏడీ సుమిత్ర, పశువైద్యులు సుజనశ్రీ, విక్రమ్, ఉస్మాన్ సిబ్బంది పాల్గొన్నారు.